## 1985 రక్తాక్షి సంక్రాంతి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి 116/- పొందిన కథ

హైస్కూలు హెడ్మాష్టరుచేసి పదకొండేళ్ళ క్రిందట రిటైరయినాను. నా ఇద్దరు కొడుకులూ—ఒకడు ఇంజనీరు, రెండోవాడు డాక్టరు.

నలుగురు అల్లుళ్ళూ పెద్ద పెద్ద ఆఫీసర్లే. మనుమలు మనుమరాళ్ళు డాక్టరీలు, ఇంజనీరింగులు చదువుతున్నవాళ్ళే అంతా. ఇంకా చిన్న చిన్న వాళ్ళు కాన్వెంట్ చదువుల్లో వున్నారు.

నా కేలోటూ లేదు. జీవిత భాగస్వామినిని నాలుగేళ్ళ క్రిందట కోల్పోవడం తప్ప. ఆవిడకి అలా 'పుణ్యస్త్రీ'గా వెళ్ళిపోవడం బాగానే వుంది.

"ఎంతటి వాళ్ళకి పసుపు కుంకుమంతో చావు" అంటూ ఆనందంగా వెళ్ళిపోయింది ఎటొచ్చి నేనే వంటరి వాడనయి పోయేను. ఆవిడ నా కల్లోకి వచ్చినప్పుడల్లా అడుగుకున్నాను. "నన్నూ నీ దగ్గరకు తీసుకో పార్వతీ" అని. "టైమ్ రానీయండి" అంటుంది కానీ త్వరపడదు

అయితే ఒకటి—నా పెద్ద కోడలు మహా ఉత్తమురాలు నా మాట తు. చ. తప్పదు. నాకేమీ లోటు రానివ్వదు. పండుగలు పబ్బాలు వస్తే నా ఇష్టప్రకారం పిండి వంటలు చేస్తుంది. పూజలు ఏర్పాటు చేస్తుంది. ఇహ ఆవకాయ రోజుల్లో నా సలహా సంప్రదింపులు లేనిదే ఇంట్లో మామిడి కాయ ముక్క కూడా తెగదు సరికదా.... ఎక్కడికయినా పేరంటానికి వెళ్ళాలన్నా సరే.... ఫలానా వాళ్ళింటికి నేనే వెళ్ళాలంటారా పిల్లల్ని పంపితే చాలుతుందా అని నన్ను అడగందేకదలదు.

నేను మన అంతస్తుకి తగిన వాళ్ళని చూసి కోడల్ని వాళ్ళింటికి వెళ్ళమన్ని ఆదేశిస్తుంటాను.

నాకు ఆపాటి ఈపాటి వాళ్ళు ఆనరు. మొదటే చెప్పేనుగా నా సంతానం అంతా ఎలాటి స్థితిలో ఉన్నదీను. నేను పుట్టిందీ పెరిగిందీ పాడిపంటలకు ఆలవాలమైన కోనసీమలో. ఇంత అన్నదానాలకి లోటులేని పెద్దేటి లోగిట్లో అల్లారుముద్దుగా పెరిగేను.

హైలూ, ఆర్భాటమే తప్ప. సామాన్య జీవితం. సర్దుకుపోవలసి రావడం నా జోలికి రాలేదెప్పుడూను.

ఉద్యోగం చేపట్టాక పల్లెటూళ్ళో పొలం అమరకం ఇచ్చేసేను. రిటైర్ కాబోయే ముందు పట్టణంలో పెద్దలాంటి మేడ కట్టేసేను. అదృష్టవశాన నేను పెద్ద మేడ కట్టిన పెద్ద పట్టణంలోని అతి పెద్ద ఫాక్టరీలో నా పెద్ద కొడుకు పెద్ద ఇంజనీరు. కాలుమీద కాలేసుకుని హాయిగా కొడుకు కోడలు మనుమలు....నాకేమిటి?

ఉదయం పూజ. సంధ్యావందనం. మధ్యాహ్నం మృష్టాన్న భోజనం. సాయంకాలం కాస్త శరీర శ్రమ చేస్తే మంచిది కదా! గార్డెన్‌లో కాస్త పని చేస్తాను. పని అంటే బెల్లు తవ్వి పాదులు చేసి మొక్కలకి నీరు పెట్టడం కాదు. అవన్నీ చేసుకునేటందుకు మాలి ఉండనే ఉన్నాడు. రవంత శ్రమ అంటే క్రోటన్స్ మొక్కల మధ్య పెరిగిన "గడ్డిపరకలు" పీకేస్తుంటాను. అయితే తోటలో గడ్డి పీకేసినకొద్దీ మొలుస్తుంది. పూలమొక్కలకి వేసిన ఎరువుఅంతా తన పొట్టన పెట్టుకుని చక్కగా ఏపుగా ఎదిగిపోతుంటుంది. నాకు గడ్డిపరకలు అంటే చెడ్డ చిరాకు. పెద్ద పెద్ద పార్కుల్లో "గడ్డి"ని పనిమాలా పెంచుతారు. అందమైన పూలమొక్కల మధ్య ఎందుకూ కొరగాని "గడ్డి. లాన్సట లాన్సు"

ఒకరోజు విసుక్కుంటుంటే "ఎమ్ టెక్" చదువుతున్న నా మనవడు రాజేంద్ర అన్నాడు:

"అదేమిటి తాతయ్యా! గడ్డి అంటే అంత చులకనగా మాట్లాడతావు. గడ్డి తినే గదా గంగిగోవు కమ్మని పాలు చేపుతుంది. పైగా గడ్డికి సాహిత్యంలో కూడా ఓ విశిష్ట స్థానం వుండబట్టేకదా రాయప్రోలువారు అమలిన శృంగార శృంఖలాబద్ధులైన స్త్రీ పురుషుల ఆత్మీయతని "తృణకంకణం"తో బంధించేరు. జాన్ రస్కిన్ "బ్లేడ్ ఆఫ్ గ్రాస్"ని గురించి........

"చాల్లే ఆపు!" గద్దించేను వాణ్ని. గడ్డి పరకలకి సాహిత్యంలో విశిష్ట స్థానం ఇచ్చిన కవుల మీద కోపంతో కాదు. ఎమ్ టెక్. చదువుతున్న కుర్రాడి ప్రతి మాట. ప్రతి చేత టెక్నలాజికల్ పరిభాషలోనే వుండాలి. అంతేకాని...కవులు. సాహిత్యం భావోద్రేకం ఊహాజగత్తు రసదృష్టి నీరస దృష్టి రాజేంద్ర ఛాయలకు రావడం కూడా నాకు కిట్టదు. మనం మాట్లాడే ప్రతి అక్షరం మనంఏమిటో చాటుతుండాలి. మనం చేసే స్నేహాలు మన అంతస్థుని చాటుతుండాలి.

ఈ విషయంలో కోడలికి కూడా చాలా సార్లు చెప్తుంటాను. "ఆ పనివాళ్ళకి, వంట వాళ్ళకి ఎక్కువగా చనువు ఇవ్వకమ్మా" అని. [illegible] మిగతా. వాటిల్లో ఎంతో భయ [illegible] ంటుంది. కాని ఆ ఒక్క—

### పరిచయం

ఆంగ్లభాషా బోధనలో పది సంవత్సరాల అనుభవం. ముప్పై ఎనిమిదేళ్ల వయస్సు. అప్పుడప్పుడు కథలు వ్రాసే అలవాటు. నవలలు వ్రాయడం మొదలు పెట్టలేదు. హిందీ, తెలుగు, ఇంగ్లీష్ భాషలలో అన్నిరకాల పుస్తకాలు చదువుతుంటాను. నన్ను కథలు వ్రాయడానికి ప్రోత్సహించింది సాహితీ మిత్రులు సత్యప్రసాద్‌గారు కాగా; నా ప్రతి కథకీ మొదటి శ్రోత, విమర్శకురాలు నా సహ



ఉపాధ్యాయిని రంగనాయకమ్మగారు. నన్ను ప్రోత్సహించిన ప్రతిఒక్కరికి నా నమస్సులు.

—రాయప్రోలు హైమ

# గడ్డి పరకలు

రాయప్రోలు హైమ



దానికే "మొండి"గా వుంటుంది. చుట్టు ప్రక్కల గుడిసెల్లో జనాభా మా తోటలో పంపుదగ్గర నీళ్ళకి చేరితే వాళ్ళతో బాతాఖానీ వేస్తుంటుంది. వాళ్ళలో ఎవరికైనా రోగాలు, రొష్టులూ వస్తుంటే పథ్యానికంటూ పాత చింతకాయ పచ్చడి నిలువ ఉసిరి పచ్చడి, మాగాయ అందిస్తుంటుంది. పోనీ దానికూడా నేనేం అనుకోను మనకి కలిగినది ఒకళ్ళకింత పెడతాం.

"ఏం వే రంగీ నీ పిల్లని అత్తారింటికెప్పుడు పంపుతావే."

"ఈ నెల రేషను కార్డుమీద కిరసనాయిలు తెచ్చుకున్నావే సుబ్బి."

"అప్పుడే అంత పెళ్ళి కళ వచ్చేసిందే మిఠేవ్- బంగారి. పెళ్ళి కుదిరీ కుదరకుండానే"అని వాళ్ళని పలకరిస్తూ నవ్వుతూ నవ్విస్తూ గడుపుతుంది. ఇంట్లో వంట మనిషితోను అలాగే "కుర్రాణ్ని చక్కగా చదివించుకోవమ్మా సుబ్బమ్మపిన్నీ. వాడికి ఉద్యోగం వస్తే నీకీ వంటలరాత తప్పుతుంది." సలహాలు పడేస్తుంది.

నాకు చిర్రెత్తుకొచ్చింది. అందరూ చదివేసి ఉద్యోగాలు చేసెయ్యడమే! అందరూ అందలాలు ఎక్కేస్తే మోసేదెవ్వరూ!

సుబ్బమ్మలు. వెంకయ్యలు కొడుకుల్ని డాక్టర్లనీ ఇంజనీర్లని చేసేస్తే మన ఇళ్ళల్లో వంటవాళ్ళు, తోటమాలీలు ఎక్కడ దొరుకుతారు.

ఇవన్నీ నేను ఎలాగో సహిస్తాను. కానీ ఎంత కాదనుకున్నా నేను సరిపెట్టుకోలేనివి కొన్ని ఉంటున్నాయి.

ఇంట్లో అందరూ పుస్తకాలు చదివే వాళ్ళాయేను. అందరూ తలోరకం న్యూస్ పేపర్ చదవకపోతే అన్నంఅరగదనేవాళ్ళే రెండు రకాల ఇంగ్లీషు. రెండు రకాల తెలుగుదినపత్రికలు తెల్లారేసరికిగుమ్మంలో పడి ఉంటాయి. ఇహ కథల పుస్తకాలు, వారపత్రికలు సరేసరి. కోడలి కోసం మూడు ప్రముఖ వార పత్రికలు, రెండు స్త్రీల మాసపత్రికలు తెలుగువి వస్తాయి. మా మనుమరాలు విద్యాధరి ఎమ్మే. కోసం రెండు ఇంగ్లీషువి సినిమా పక్ష పత్రికలు వస్తాయి. మనవడికి కావల్సిన స్పోర్ట్సు పత్రికల లెక్కే నాకు తెలియదు. అయితే వీటన్నిటికీ నెలకి చెల్లించవలసిన బిల్లు కోసం న్యూస్ ఏజంటు రావడమయినా ఆలస్యం చేస్తాడు కాని....ఆ పాత కాగితాలు కొనే వెంకటేశం మాత్రం ఒక్క పూట ఆలస్యం చెయ్యడు. ఫస్టు తారీఖున టంచనుగా నెల జీతగాడిలా వచ్చి హాల్లో కూర్చుంటాడు. అతడ్ని చూస్తే చాలు కోడలు కొండంత ఆప్యాయత చూపిస్తుంది. "రావయ్యా వెంకటేశం ఇల్లంతా కాగితాలతో చీదరెత్తిపోతోంది. రక్షించి వచ్చావు" అంటూ టీ ఇస్తుంది. టిఫిన్లేమయినా మిగిలినవి ఉంటే పెడుతుంది. ఆయాసపడుతూ మేడ మెట్లెక్కి గదులన్నీ గాలించి పత్రికలన్నీ తెచ్చి అతని ముందు పోస్తుంది. అతను హుషారుగా తూకం వేసుకుంటూ ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెబుతాడు. కేజీ కాగితాల కింత అని లెక్కగట్టి అమ్మాయికి రొక్కం ఇస్తాడనుకోండి.

## విముక్తి

కట్నుకొన్నవాడి నీడలో
 కలకాలము జీవించాలనీ
కన్య దానము చేసి
కట్నమిచ్చి పంపుతాడు
కన్నతండ్రి.
కాని–
వరకట్నం దాహం తీరని
వరుల అమానుషానికి గురై
వల్లకాటికి చేరుతున్నారు నేటి వనితలు
కట్నాల మారణహోమం నుంచి
 వనితలకు విముక్తి ఎప్పుడో?


—పి. సత్యవతి

అయితే యేం ఇలా వీధులంట తిరిగే వాళ్ళు వచ్చి మోసం. వాళ్ళదగ్గర సరయిన తరాజు ఉండదు. తూనిక రాళ్ళు దొంగవి ఉంటాయి తూకం కూడా దగా అని చెప్పేను కోడలితో.

"పోనిస్తురూ ! అందులో మనకెంత రాను ఎంత పోను"....అంది.

"అయినా మన చేతిలో కావలసినంత మంది పనివాళ్ళున్నారు కదటమ్మా ! కొట్టుకి పంపించి అమ్మిస్తే సరయిన ధర పలుకుతుందిగా....

"ఏదోలెద్దురూ ! అందరూ అలా కొట్ల మీదికి పంపిస్తే ఇలా ఇంటింటా తిరిగి పాత కాగితాలుకొని మారుబేరానికి అమ్ముకునే వాళ్ళేమయిపోవాలి. వీళ్ళవృత్తి పడిపోదూ! మనిషికి సరయిన వృత్తి దొరక్కపోతే ఏం చేస్తాడు ! సమాజ విద్రోహకరమయిన దొంగతనాలు దోపిడీలు మొదలు పెడతాడు...."




ఏం చెబుతాం కథలూ, పత్రికలు వాటి ప్రభావం అట్టే చదవకపోయినా అందరూ అన్ని విషయాలమీదా ఉపన్యాసాలిచ్చెయ్యడమేను.

ఇహ స్త్రీలు సామాన్లిచ్చి పాత బట్టలు పట్టుకెళ్ళే "బీబీ"ని చూస్తే మా కోడలు ఆనంద పరవశం అవుతుంది. నా వళ్ళు మండిపోతుంది.

అమ్మాయికి సామాన్లంటే చెడ్డయిష్టం. అందులోనూ ఎప్పుడు చూసినా ధగ ధగ మెరిసే స్టీలు పాత్రలంటే ప్రాణం. నాకవంటే చిరాకు.

ఇనప ముక్కలు, మెరిసినన్నాళ్ళు మెరిసినా చిల్లు పడిందంటే ఇహ కాసుకి కొరగావు. అదే ఇత్తడి, కంచు అయితే కాస్త చింతపండు పట్టించి తోముకుంటే తళ తళ మెరవనూ మెరుస్తాయి. మోజు తీరాక అమ్మేసుకుంటే సొమ్ము సొమ్ము లాగా ఉంటుంది. కాకపోతే కరిగించి మరో ఆకారంలో పాత్రలు చేయించుకోవచ్చు

ఎందుకొచ్చిన స్టీలు గిన్నెలు -పైగా ఇంటిలో ఉన్న గుడ్డలన్నీ పడేసి మరీ కొనడమా !

చిత్తు కాగితాల వెంకటేశం నెలకొకసారే వస్తాడు. స్టీలు గిన్నెల "బీబీ" నెలలో ఎన్నిసార్లయినా వస్తుంది.

ఏ రోజయినా మధ్యాహ్నం మూడు కొడ్తే అమ్మాయి హాల్లో తీరుబడిగా కూర్చుని పత్రిక తిరగవేసే సమయం కనిపెట్టి మరీ వస్తుంది.

"కొత్తరకం పూలసెజ్జ తెచ్చినా" అంటుంది.

న్యూడిజైను టిఫిన్ బాక్సు అంటుంది.

"లతలు చెక్కిన అప్పడాల డబ్బా" ఊరిస్తుంది. అమ్మాయికిహ ఒళ్ళు తెలియదు. ఇంట్లో పాతవీ కొత్తవీ నలిగినవి, నలగనివీ.... బట్టలు తెచ్చి దానిముందు కుప్పపోస్తుంది.

బీబీ మురుస్తూ గునుస్తూ బట్టలన్నీ సందెడు మూటకట్టుకొని కొబ్బరి చిప్పంత గిన్నో, అరచెయ్యి అంత పళ్ళెమో అమ్మాయికి అందించి వెడుతుంది.

ఈ విషయంలో అమ్మాయితో నాకు రెణ్నెల్ల క్రిందట చాలా పెద్ద వాగ్వివాదం అయింది. రెండురోజులపాటు సరిగా మాట్లాడలేదు నేను కోడలితో. ఒక రోజు గాంధీగారి ఆయుధం ప్రయోగించి అభోజనం పడుకున్నాను! అమ్మాయి చాలా బాధపడింది.

ఆ రోజు సాయంత్రల నేను గీతా

భవనం నుంచి వచ్చి గ్లాసెడు మంచినీళ్ళు తాగి పడుకున్నాను. భోజనానికి రెమ్మని విద్యాధరి నాల్గుసార్లు వచ్చి పిలిచింది. నాకు ఆకలిగా లేదన్నాను. ఇహ కోడలే వచ్చింది.

"మీకు నిజంగా ఆకలి లేక కాదు. నా మీద కోపం-పెద్ద ప్రాణం—సోలిపోతారు. లేచి పడికట్టుకోండి. ఇహనెప్పుడూ బీబీని గుమ్మం తొక్కనియ్యనుగా —మీరు తినక పోతే నేనూ తినను" అనునయించింది.మరీ మొండిగా వుంటుందని లేచి భోజనంచేసేను కంచంముందు కూర్చున్నానే కాని ముద్ద నోటికి పోలేదు. ఆ నాడు మధ్యాహ్నం జరిగిన సంఘటనే కళ్ళముందు కదిలింది.

మధ్యాహ్నం మూడు కావస్తుండగా పెద్ద స్టీలుగంగాళం ఒకటి నెత్తినపెట్టుకుని గేటులో అడుగుపెడుతూంది బీబీ.

"అబ్బో! అంత పెద్ద గంగాళమే! అమ్మాయి చూస్తే విడిచిపెడుతుందా!"

బీబీ: అల్లంత దూరాన ఉండగానే "పోపో కోడలు ఊళ్ళో లేదు". అని కేక పెట్టేను హాల్లో కూర్చున్నవాడినల్లా ముందు వరండాలోకంటా వచ్చి.

బీబీ నవ్వింది. వెనక్కి తిరగలేదు. బాహాటంగా వరండా ఎక్కేస్తూ:

"ఊరుకోండయ్యగారు! అమ్మగారు మేడ మీద నిలబడ్డారు. నన్ను చూసి నారు రమ్మని పిలిచినారు"....

కళాయి దింపి తిష్ట వేసింది. కోడలు నవ్వుకుంటూ మేడ దిగింది దిగుతూనే...

కళాయి బ్రహ్మండంగా ఉంది కానీ బీబీ....నీ ఆశకు అంతు లేకుండా ఉందీ మధ్య. సరయిన బేరం చెప్పు" అంది కళాయి పట్టుకొని చూస్తూ.

కళాయి బాగా పెద్దదేను మూరెడు కైవారంలో రెండు మూర్ల ఎత్తులో బాగా దట్టంగా రెండు వైపులా పెద్ద పెద్ద పట్టు గొళ్ళేలతో చూడ్డానికి బాగానేవుంది. కాని దీని ఉపయోగం ఏమిటి మనకిప్పుడు అదే అన్నాను అమ్మాయితో.

"మంచివారే రేపు విద్యాధరి పెళ్ళివస్తే పులుసు కళాయి కావద్దూ....

"ఇంకా నయం ఎప్పుడో ఒక్కసారి వచ్చే పెళ్ళిళ్ళ కోసం ఇంతలేసి పెద్ద శాల్తీలు కొనుక్కుంటామా ! పనొచ్చి నప్పుడు ఎక్కడయినా ఎరువు తెచ్చు కుంటాం. లేకపోతేఅద్దెకితెచ్చుకుంటాం." విసుక్కున్నాను.

"అసలు నువ్వు బేరం చెప్పవే బేబీ" అమ్మాయి నా మాట విన్పించుకున్నట్లు లేదు.

బేబీ బేరం చెప్పింది.


"అరవై చీరలివ్వంచండమ్మా!" అంది చాలా తేలిగ్గా. చీరలంటే ఆమె దృష్టిలో జేబు రుమాలంత తేలిగ్గా ఉన్నట్లుంది.

అరవై చీరలంటే అన్నీ చీరలేకపోయినా పర్వాలేదు. సరితూగే మారు శాల్తీలు పుచ్చుకుంటుందిట. రెండు పాంట్లు ఒక చీరకు సమానం. అలాగే మూడు షర్టులు. పధ్నాలుగు జాకెట్లు, నాల్గుఓణీలు, నాలుగు లుంగీలు, మూడు ధోవతులు చీరకు సమాన మట. ఈ లెక్కలో ఎన్ని బట్టలుపోస్తే అరవై చీరలవుతాయి.

అరవయ్యీ లేదు డెబ్భైలేదు. ముప్ఫ యిస్తానే బేరమాడింది. కోడలు.

"తమరే అలాగంటే నాకేటి లాబం ఉందమ్మా మీరు పెద్ద కళాయిస్తే తెమ్మ న్నారని ఈ యేళింకే శాల్తీలూ ఏసొక్క లేదు"....గునిసింది బీబీ.

సరేలే నలభయి చీరలు....




"కానియ్యండి! మీకూ నాకూ రండా గొండి తప్పదు పడెయ్యండి గుడ్డలు."

అమ్మాయి బీరువాలన్నీ గాలించింది, అబ్బాయి ట్వీడ్ పాంట్లు, ఆమొలి వెంకట గిరి చీరలు,విద్యాధరివి అమెరికన్ నైలెక్సు చీరలు అవీ....పెద్ద మనవడి టీ షర్టులు.

"అబ్బే! ఇది పాతబడిందమ్మా! గుడ్డ బాగానే ఉన్నా రంగు బొత్తిగా పాడయి పోయింది....ఈ మోడల్ పాంట్లు ఇప్పు డెవడు కొంటారమ్మా...."

అమ్మాయి ముందు పడేసిన చీరలన్నిం టికి వంకలుపెట్టింది. అబ్బాయి ప్యాంట్లు అన్నీ కొత్తగా వున్నవే తీసిపడేసింది. విద్యాధరి చీరలు పల్చగా ఉన్నాయంది. మేటడు రాసిలోనూ బీబీ వంకపెట్టని గుడ్డ ఒక్కటి లేదు. అక్క డికి తను తెచ్చిన పులుసు కళాయిమాత్రం పూర్ణచంద్ర బింబంలా ఉన్నట్లునూ,

ఆ కళాయంత పెద్ద పాత్ర లేకపోవచ్చు కాని మా ఇంట్లో స్టీలు సామాను బళ్ళకొద్దీ ఉంది. నిత్యం వాడుకుంటున్నవి వాడు కుంటుండగా పెద్ద కోడలు బీరువాల్లో దాచిన గిన్నెలు గిద్దలు కోకొల్లలు

"అమ్మాయ్ పద్మా! అన్ని బట్టలు అలా రాసి పోసి ఒక్క కళాయి కొంటు న్నావూ వచ్చేది చలికాలం, పనివాళ్ళు పాత గుడ్డలడుగుతారు వరద బాధితు లొస్తారు. అగ్ని బాధితులొస్తారు. బీదా బిక్కీ గుమ్మంలోకి వస్తారు....లేదనాల్సిం దేగా.

చివరి ప్రయత్నం చేసి చూసేను.

"మీరుండండి తాతయ్యగోరూ. నేను బీదదాన్ని కాదంటారా. నా బేరం చెడ గొట్టమాకండి....కసురుకుంది బీబీ. నన్ను కోడలేం మాట్లాడకుండా బట్టలు లెక్క పెడుతూంటే నాకోపం వచ్చి టిఫిన్ తీసుకోకుండానే గీతా భవనానికి వెళ్ళి పోయేను. మళ్ళీ వచ్చేసరికి స్టీలు కళాయి మధ్యలో పెట్టుకొని పరీక్షిస్తూ నా మనుమ రాలు కోడలు నవ్వుకుంటూ కబుర్లు చెప్పు కుంటున్నారు. ఏదో కొత్త వస్తువు అమ రిందన్న మురిపెమే కాని బట్టల బీరువా లన్నీ కాళీ అయిపోయినాయని వాళ్ళకి చీమ కుట్టినట్లుగా కూడా లేదు. అందుకే సత్యాగ్రహం మొదలు పెట్టేను.

ఆ తర్వాత నెలపాటు బీబీ మా గుమ్మం తొక్కలేదు. కోడలు నా మాట విని బీబీని ఎంటర్ టెయిన్ చెయ్యటం మానేసిందని సంబరపడ్డాను. అయినా మళ్ళీ అనుమానం నేనింట్లోలేని సమయాల్లో బీబీని పిలుస్తోం దేమోనని అమ్మాయి స్టీలుసామాన్ల మోజు అలాంటిది.

ఎముకలు కొరికే చలిరోజులు. సాయం త్రం అయిదుకాకుండాచీకటి పడిపోతోంది. గీతోపన్యాసాలు ఆరు కాకుండానే ముగించే స్తున్నారు శాస్త్రిలవారు. గీతాభవనం దరి దాపుల వున్నకూలి జనాల గుడిసెలముందు నుంచి ఇంటికి రావాలి. ఆ గుడిసెల స్థలా లన్నీ గీతాభవన స్థలదాత డాక్టర్ రంగా రావుగారు పట్టాలిచ్చినవే. ఈయన కిదేం బుద్ధీ! శుభ్రమయిన గీతాభవనం చుట్టూ ఈ అలగా జనాన్ని చేర్చేడూ! అనుకుంటాను అప్పుడప్పుడు.

ఏమయితేనేం ఆ చివరి రోజుల్లోఅలగా జనం నిలువెత్తు చలిమంటలు వేస్తుంటారు. మంటల చుట్టూ పిల్లా పెద్దా చేరి కిచకిచ లాడుతూ ఎగదోస్తూ దిగదోస్తూ.... వీళ్ళె ప్పుడో కొంప ముంచుతారు "అనుకున్నా నోరోజున.

అలాగే అయింది. ఒకనాడు తెల్లారే

సరికి నూటయాభై గుడిసెలు వీతిహోత్రుడి ప్రీతి అయిపోయాయి. అయిదు వందల మంది నిర్వాసితులయ్యారు. నందుకునేం దుకు గిద్దెడుగింజల్లేక వంటి మీదున్నది తప్ప మారు బట్టల్లేక ఆకలితో నకనక లాడుతూ వడ వడ వణికి పోతూ హాహా కారాలె త్తి పోతున్న ఆ జనాన్ని చూస్తే కడుపు తరుక్కుపోయింది.

జీవకారుణ్య సంఘం వారు అగ్ని బాధితులకి సంతర్పణలు చేసేరు. అందులో ఒక పూట వెచ్చాలన్నీ "గీతాభవన" రాజ పోషకులమయిన మేమంతా ఇచ్చేం. కోడలు పదిశేర్ల బియ్యం, శేరు కందిపప్పు, అర వీశెచింతపండు. అరకేజీ నూనె. మిరప కాయలు ఇంకా ఏవేవో అందించింది. అమ్మాయిది పెద్ద చెయ్యే....

మరో స్వచ్ఛంద సేవా సంస్థ వారు అగ్నిబాధితుల కోసం పాతబట్టలు సేకరిస్తూ మా యింటికి వచ్చేరు. కోడలు పద్మ తెగ బాధపడింది. "మామయ్యా! మీ మాగ సకుండా పులుసు కళాయి అంటూవున్న పాత బట్టలన్నీ బీబీకి అర్పించేసేను. ఇప్పుడింకేం చెయ్యను...."

ఇల్లంతా వెదికి వెదికి రెండు దుప్పట్లు ఇచ్చిందనుకోండి.

ఆ సాయంత్రం గీతా భవన్‌కి వెడుతూ నాకూ అన్పించింది. నా బట్టల్లోనించి ఒకటో రెండో శాలీలు తీసి వణికే ముసి లాడి కిద్దామని. బీరువా గాలించేను. అందులో ఏవీ పనికి రానివి లేవు. పార్వతి పట్టు చీరలు. నా పట్టు తాపితాలు ఆమె జ్ఞాప కంగా దాచుకున్న జరీ చీరలు.... ఆమె కిష్టమయిన నా ధోరతులూ నేను ఉద్యోగం చేసినాన్నటి సూట్లు....నా గతించిన హోదాకీ గుర్తులూ....ఏవీ పడేసేవి కావు.

అయినా వస్త్రదానం చేద్దామనే నా బలీయమైన కోర్కెను అణుచుకోలేక రెండు కొత్తగా ఉన్నవే ధోవతులు తీసి చంకన పెట్టుకుని బయల్దేరేను....

అడుగులు వేస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఎంతో తృప్తిగా ఉంది. స్టీలు గిన్నెలు కొనుక్కుంటే ఏమొస్తుందీ బీబీ నిక గుమ్మం తొక్కనివ్వకూడదు.

అరె.... ఎవరది.... ఆ పెద్దపెద్ద బట్టల మూటల మధ్యన మహారాణీలా కూర్చున్నది. చుట్టూ ఆ జనం ఏమిటి? ఆ మూటలు విప్పి అలా చేతికొచ్చినవి వచ్చినట్లు పంచి పెట్టేస్తోంది. పిల్లాపెద్దాముసలీ ముతకా కేరింతాలు కొట్టుకుంటూ ఆమె చేతిలోంచి ఎలా అందుకుంటున్నారో?

చొక్కాలు, పంచెలు, చీరలు, దుప్పట్లు పాంట్లూ, రవికెలు ఎవరబ్బా ఇంకెవరు. బీబీ- బీబీ- బీబీ.

స్టీలు సామాన్ల బీబీయే అలా పంచి పెట్టేస్తోంది వ్యాపారంలో నష్టంరాదూ?

"దండాలండి తాతగోరూ, వారం కిందట నానీ గుడెసెల్లోనే ఉన్నానండి! మొన్న మొన్ననే ఇల్లు మార్చేసినా ఈళ్ళంతా నా వోళ్ళే....నా వోళ్ళని కట్టంలో కని పెట్టమని నాకు అల్లా ....సెప్పినాడు .... యాపారానిదేముంది .... నెల్లాళ్ళు ఊరు తిరిగితే అదే సరిపోద్ది....

నా కళ్ళు తిరిగేయి. మనసు అదోలా అయింది. నా కాలికింద గడ్డిపరకలు హఠాత్తుగా అశ్వత్థ వృక్షం అంత ఎత్తు ఎదిగిపోయాయి. నేను చిటారు కొమ్మ నుంచి దబ్బున జారి పడిపోయాను. ●

> **'వనితావని' శీర్షికలో "విష్ణుమాయ" నవలారచయిత్రి శ్రీమతి జొన్నలగడ్డ లలితాదేవి ప్రశ్నావళి నిర్వహిస్తారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. పాఠకులు తమ ప్రశ్నలను-**
>
> **శ్రీమతి జొన్నలగడ్డ లలితాదేవి,**
> **ధనంనాయుడు బిల్డింగ్స్,**
> **ఇండియన్ మెడిసిన్ హౌస్ వద్ద,**
> **గవర్నరుపేట, విజయవాడ-2.**
>
> **అన్న చిరునామాకు పంపించాలి. ప్రతి వారం ఒకఉత్తమ ప్రశ్నకు శ్రీ ముళ్ళపూడి వెంకట రమణగారి "శ్రీకృష్ణ లీలలు" ఆటోగ్రాఫ్ కాపీ బహుమతిగా వుంటుంది. పాఠకులు తమ పూర్తి చిరునామాను ప్రశ్నతోపాటు తప్పని సరిగా వ్రాయాలి.**
>
> **—ఎడిటర్**

